క్లుప్తంగా

ప్రత్యేక పూజలు


కూర్మనారాయణ స్వామి

ఆస్పరి: మండలంలో హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మనారాయణస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో కూర్మనారాయణ, హనుమన్నస్వామి వార్లకు గంగ పూజ, మహామంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

గడ్డివాముల దగ్ధంపై విచారణ


విచారణ చేస్తున్న ఆలూరు సీఐ వెంకట చలపతి, ఎస్‌ఐ

హొళగుంద: మండలంలోని హెబ్బటం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్న గడ్డివాముల దగ్ధంపై ఆలూరు సీఐ వెంకట చలపతి హొళగుంద ఎస్‌ఐ బాల నరసింహులతో కలిసి శనివారం విచారణ చేపట్టారు. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో గ్రామ శివారులోని కురుకుంద రోడ్డులో వేసిన రైతులు కూర్మయ్యగారి శేకన్న, సూగూరు పెద్ద నాగయ్య, మాల కిష్టప్ప, దాసరి తిక్కయ్య, ఉశేన్‌పీరకు చెందిన 9 గడ్డివాములు అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన సంగతి తెలిసిందే. ఈ ఘటన ప్రమాదవశాత్తు చోటు చేసుకుందా లేదా ఎవరైన నిప్పు పెట్టారా అనే కోణంలో స్థానికులను విచారించారు.

విద్యతో అంధుల జీవితాల్లో వెలుగులు


ఆలూరు భవిత కేంద్రంలో దివ్యాంగులకు కేక్ తినిపిస్తున్న ఎంఈఓలు

ఆలూరు రూరల్: విద్యతో అంధుల జీవితాల్లో వెలుగులు నిండుతాయని ఎంఈఓలు కోమలా దేవి, చిరంజీవి రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని భవిత కేంద్రంలో ప్రపంచ బ్రెయిలీ దినోత్సవం నిర్వహించారు. అంధ బాలలను భవిత కేంద్రాల్లో చేర్పించి వారి భవిష్యత్‌కు తోడ్పడాలని పిలుపునిచ్చారు. అనంతర అంధ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేసి కేక్ కట్ చేసి పంచిపెట్టారు.

మద్దికెర : అంధుల అభ్యున్నతి కోసం లూయిస్ బ్రెయిలీ ఎంతగానో కృషి చేసి లిపి కనుక్కొని వారికి మార్గదర్శకుడయ్యాడని ఎంఈఓ రంగస్వామి అన్నారు. శనివారం స్థానిక మెయిన్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ బ్రెయిలీ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు.

ఎస్సీ జాబితా నుంచి కురువలను తొలగించాలి

చిప్పగిరి: ఎస్సీ జాబితాలో మాదాసి కురువ, కురువ కులాలను చేర్చారని వారిని వెంటనే తొలగించాలని ఎంఆర్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఆర్‌ఐ సునీతకు సంఘం నాయకులు నెట్టకంటి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని నేమకల్లులో 15, రామదుర్గం లో 4, చిప్పగిరి లో 5, దొల్తాపురం 4 ఇలా మండలంలోని అనేక గ్రామాల్లో దాదాపు 35 మందిని ఎస్సీ జాబితాలో చేర్చారన్నారు. వీరిని వెంటనే జాబితా నుంచి తొలగించాలని కోరారు. జాబితా నుంచి వారిని తొలగించకపోతే సంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ఇందుకు ఆర్‌ఐ స్పందిస్తూ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. నాయకులు కిల్టాన్,మల్లికార్జున,బన్ని,రుషి,పెద్దయ్య పాల్గొన్నారు.

రెవెన్యూ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

మద్దికెర : ఎవరైనా రెవెన్యూ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హుసేన్ సాహెబ్ హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో స్థలాలు ఆక్రమిస్తున్నారనే ఫిర్యాదు మేరకు స్థానిక పందుల కుంట, పశు వైద్యశాల సమీపంలో స్థలాలను కొలతలు వేయించారు. రెవెన్యూ స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినా కూలగొడతామని హెచ్చరించారు. ఆర్‌ఐ రవికుమార్, వీఆర్వో రంగస్వామి, సర్వేయర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాటం

మద్దికెర : ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నిరంతర పోరాటాలు చేస్తుందని ఎస్టీయూ నాయకులు ఆంజనేయులు, శీనప్ప, చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఎంఈఓ రంగస్వామి చేతుల మీదుగా క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి సమస్యల పరిష్కారానికి పూనుకుంటామన్నారు. ఉపాధ్యాయులు సత్తార్, రహంతుల్లా, విజయరాజు పాల్గొన్నారు.

వినియోగానికి దూరమై..

- నిరుపయోగంగా మారిన వివిధ శాఖల కార్యాలయ భవనాలు
- శిథిలావస్థకు చేరుతున్న వైనం
- విలువైన సామగ్రి దొంగల పాలు
- పట్టించుకోని అధికారులు
- అద్దె భవనాల్లో కొన్ని శాఖల కార్యకలాపాలు


హొళగుందలో ముళ్లకంపలతో నిండిపోయిన అగ్రికల్చర్ భవనాలు


హొళగుందలో నిరుపయోగంగా మారిన సచివాలయం-2


పటిష్టంగా ఉన్నప్పటికీ వినియోగానికి నోచుకోని పాత పోలీస్‌స్టేషన్

హొళగుంద: మండలంలో పలు ప్రభుత్వ భవనాలు ఆదరణ కరువై శిథిలమవుతున్నాయి. విలువైన సామగ్రి దొంగల పాలవుతూ అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారుతున్నాయి. కొత్త భవనాల్లోకి మారిన అధికారులు పాత భవనాల ఆలన పాలనను గాలికొదిలేశారు. కొన్నేళ్ల క్రితం మండల కేంద్రంలో రూ. 84 లక్షలతో నిర్మించిన ఎస్సీ హాస్టల్, సచివాలయ భవనాలు, ఆర్‌బీకేలు, హొళగుందలో ఇప్పటికీ చెక్కు చెదరని పాత పోలీస్‌స్టేషన్, అగ్రికల్చర్ భవనాలు, కడ్లమాగి పాఠశాల గదులు, బస్‌షెల్టర్లు ఇలా పలు భవనాలు నేడు వినియోగానికి దూరమై నిరుపయోగంగా మారాయి. ఇవిలా ఉండగా.. హొళగుందలో లైబ్రరీ, ఆయా గ్రామాల్లో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ప్రభుత్వ భవనాలు ఉన్నప్పటికీ ప్రైవేటు భవనాలకు అద్దె చెల్లిస్తుండడంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడుతోంది. స్థానిక గ్రంథాలయానికి, భవనాలు లేని కార్యాలయాలకు వీటిని అప్పగిస్తే బాగుంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.


నిరుపయోగంగా ఎస్సీ హాస్టల్

సంక్రాంతి సంబరాలకు ఆహ్వానం

దేవనకొండ: ఈనెల 11వ తేదీన కప్పట్రాళ్ల గ్రామంలో జరుగనున్న సంక్రాంతి సంబరాల్లో పాల్గొనాలని గ్రామాన్ని దత్తత తీసుకున్న ఐపీఎస్ అధికారి ఆకె రవికృష్ణ (ప్రస్తుత ఈగల్ ఐజీ)ని గ్రామస్తులు శుక్రవారం విజయవాడలో కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సంబరాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సే ట్రీస్ ద్వారా జరుగుతున్న ఉద్యానవన తోటల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సంక్రాంతి సంబరాల్లో కుటుంబ సమేతంగా పాల్గొంటానని చెప్పారు. సే ట్రీస్ ప్రోగ్రాం మేనేజర్ బి.నారాయణ, చింతమాను రవికుమార్, గ్రామైక్య సంఘం లీడర్లు వి.జి.భవానీ, ఫకుర్బి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.


ఐజీ ఆకె రవికృష్ణ దంపతులను ఆహ్వానిస్తున్న కప్పట్రాళ్ల వాసులు

ముగిసిన రెవెన్యూ సదస్సులు

పత్తికొండ(తుగ్గలి) : భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో గతేడాది డిసెంబర్ 6వ తేదీ నుంచి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు శనివారం ముగిశాయి. చివరి రోజు చక్రాళ్లలో అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై రైతుల నుంచి 14 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ రమేష్ తెలిపారు. సర్పంచ్ శ్రీరాములు, ఎంపీటీసీ సభ్యుడు రాజు, ఆర్‌ఐ శ్రీనివాసులు, వీఆర్వో కృష్ణ పాల్గొన్నారు.

ఆస్పరి: మండలంలోని కారుమంచి గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామ రైతులు భూ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్‌కు దరఖాస్తులు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, వీర్‌ఓ ఎర్రిస్వామి పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవడం ద్వారా భూ సమస్యలు పరిష్కారం అవుతాయని తహసీల్దార్ గోవింద్‌సింగ్ అన్నారు. శనివారం మండలంలోని కురువళ్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సదస్సులో 4 మంది అర్జీలు అందించారన్నారు.


కారుమంచిలో సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న రైతులు

హొళగుంద: మండల పరిధిలోని మడ్డిలింగదహళ్లి గ్రామంలో శనివారం సర్పంచ్ సుధాకర్ ఆధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు సతీష్ తెలిపారు.

కృష్ణగిరి: మండలంలో రెవెన్యూ సదస్సులు ముగిశాయని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. శనివారం మన్నెకుంటలో జరిగిన సదస్సులో ఆయన పాల్గొని అర్జీలను స్వీకరించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నెల రోజులుగా జరిగిన సదస్సుల్లో దాదాపు 530 అర్జీలు వచ్చాయని చెప్పారు.

చేసిన మంచిని చెప్పొద్దా ?

- కూటమి నేతలపై ఎమ్మెల్యే విరూపాక్షి ఆగ్రహం
- మధ్యాహ్న భోజన పథకం సభలో ప్రసంగాన్ని అడ్డుకోవడంపై మండిపాటు
- ఇప్పటి వరకు సూపర్ సిక్స్ ఎందుకు అమలు చేయలేదని నిలదీత
- జగనన్న చేసిన మేలును ప్రజల మనస్సులో నుంచి చెరిపివేయలేరని వ్యాఖ్య


కూటమి నేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

చిప్పగిరి: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మంచి పనుల గురించి చెప్పొద్దా అని కూటమి మండల నేతలపై ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక జూనియర్ కళాశాలలో ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు మారయ్య గత ప్రభుత్వం విద్యావ్యవస్థలో చేసిన మంచి పనుల గురించి విద్యార్థులకు వివరిస్తుండగా సభలో ఉన్న కొందరు కూటమి నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. దీనిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాతూ గత ముఖ్యమంత్రి రాష్ట్రానికి చేసిన మంచిని ప్రజలు ఎప్పటికీ మరువరన్నారు. చెప్పకుండా మమ్ములను నివారించినంత మాత్రాన ప్రజల మనసుల్లో జగనన్న పాలన చెరపలేరన్నారు. ప్రభుత్వం ఏర్పడి 7 మాసాలైనా సూపర్ సిక్స్ అమలు కాలేదేమని ప్రశ్నించారు. చేసిన మంచి చెబితే మీకెందుకంత భయమని నిలదీశారు. సూపర్ సిక్స్ అమలుపై ప్రజలు నిలదీసే రోజు త్వరలో వస్తుందన్నారు. సర్పంచ్ గోవిందరాజులు, ఎంపీటీసీ రజినీ, నాయకులు పోతురాజు రాముడు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యం

దేవనకొండ: ఇంటర్మీడియెట్ విద్యార్థులకు డొక్కా మాణిక్యమ్మ మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా పౌష్టికాహారాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ బస్తిపాటి నాగరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల, పేద విద్యార్థులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరమన్నారు. ఆలూరు జనసేన పార్టీ ఇన్‌చార్జ్ వెంకప్ప, రామచంద్రనాయుడు, విజయభాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యతోనే గౌరవం

పత్తికొండ(తుగ్గలి) : విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని, అందుకు విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే కేఈ శ్యాంకుమార్ అన్నారు. స్థానిక జూనియర్ కాలేజీలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రిన్సిపాల్ నయిమున్నీసా అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్డీవో భరత్‌నాయక్, అర్బన్ సీఐ జయన్న , ఎంఈవో-2 రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితం నాశనం


హెబ్బటం గ్రామంలో కరపత్రాలను విడుదల చేస్తున్న ఆలూరు సీఐ, ఎస్‌ఐ


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న గ్రామపెద్దలు

కృష్ణగిరి: విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు బానిసైతే వారి బంగారు భవిష్యత్ అంధకారం అవుతుందని ఎస్‌ఐ మల్లికార్జున అన్నారు. మండలంలోని ఎరుకల చెరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన విద్యార్థులకు సైబర్ క్రైమ్ కరపత్రాలు ఇచ్చి పలు చట్టాలు, మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ మాదవ ద్రవ్యాల వినియోగించి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. ర్యాగింగ్ యాక్ట్, పోక్సో చట్టం, బాల్య వివాహాలు, రోడ్డు ప్రమాదాలు, సోషల్ మీడియా పర్యవసనాల గురించి తెలియజేశారు.

హొళగుంద: తల్లిదండ్రులు, చదువులు చెప్పే గురువులను గౌరవించని వారు, వారి మాటలను నిర్లక్ష్యం చేసే వారు తెగిన గాలిపటంలా మారి భవిష్యత్‌ను కోల్పోతారని ఎస్‌ఐ బాల నరసింహులు అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థుల కోసం ప్రవేశ పెట్టిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ప్రారంభం కార్యక్రమంలో ఎస్‌ఐ పాల్గొని మాట్లాడారు. కళాశాల డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొని బాగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ ప్రవీణ, ఎంఈఓ-2 సత్యనారాయణ పాల్గొన్నారు.

- మత్తు వ్యసనాలు ప్రజల జీవితాలను చిత్తు చేస్తున్నాయని, భవిష్యత్ అంధకారంగా మారుతుందని ఆలూరు సీఐ వెంకట చలపతి అన్నారు. శనివారం రాత్రి హొళగుంద ఎస్‌ఐ బాల నరసింహులు. ట్రైనీ ఎస్‌ఐ మహ్మద్ షఫితో కలిసి హెబ్బటం గ్రామంలో పల్లెనిద్ర చేశారు. అంతకు ముందు బస్టాండులో గంజాయి, మాదక ద్రవ్యాలు, గ్యాంబ్లింగ్, సైబర్ నేరాలు, మహిళలపై అఘాయిత్యాలు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, రోడ్డు ప్రమాదాలు తదితర వాటి పై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

పేద విద్యార్థులను తీర్చిదిద్దండి..

ఆలూరు: పేద విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగేలా అధ్యాపకులు తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే బి.విరూపాక్షి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని శనివారం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.రమాదేవి ఆధ్వర్యంలో ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులు ఎదిగేందుకు ప్రభుత్వ పాఠశాలలోనే ఇంగ్లిష్ మీడియం, సెంట్రల్ సిలబస్ అమలు, ట్యాబ్‌లు అందజేత, ఆధునిక బోధన, యూనిఫాం, పుస్తకాలు అందజేత తదితర వాటిని జగనన్న అందజేశారని, అలాగే..నాడు-నేడు కింద పాఠశాలలో ప్రైవేటుగా దీటుగా తీర్చిదిద్దారని వివరించారు. విద్యార్థులు కనీస వసతులు, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ , జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.రమాదేవి సమక్షంలో కళాశాలలో నెలకొన్న సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీటీసీలు, దేవరాజ్, వీరేష్, శివ, వరుణ్, భాస్కర్, నాగేంద్ర, బాబు,మండల కోఆప్షన్ మెంబర్ బాషా పాల్గొన్నారు.


ఆలూరు జూనియర్ కాలేజీలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ఆస్పరి: మండలంలోని పుటకలమర్రి గ్రామం వద్ద నున్న మోడల్ స్కూల్లో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పీఈటీ రాముడు శనివారం తెలిపారు. ఇటీవల కర్నూలులో జరిగిన అండర్-19 రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో వెంకటేష్ 1500,800 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించాడు. అలాగే శివశంకర వరప్రసాద్ 500 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. ఇద్దరూ ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు జార్ఖండ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ షమీల, అధ్యాపకులు అభినందించారు.

పొంచి ఉన్న ప్రమాదం..

మద్దికెర : మండలంలోని ఎం.అగ్రహారం గ్రామ ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో చెట్టు ఎండిపోయి వాలిపోయింది. ఎప్పుడు పడిపోతుందోనని విద్యార్థులు భయాందోళనలకు గురవుతున్నారు. పాఠశాలలో 54 మంది విద్యార్థులున్నారు. పాఠశాల ఆవరణలో చాలా రోజులుగా చెట్టు ఎండిపోయినా తొలగించకపోవడంతో వాలిపోతోంది. అధికారులు ఎండిన చెట్టును తొలగించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.


ఎండిపోయి వాలిపోయిన చెట్టు

ఆధార్ కేంద్రాలను పెంచాలి


హాలహర్వి సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ సెంటర్ వద్ద వేచి ఉన్న ప్రజలు

హాలహర్వి: స్థానిక సచివాలయంలో 15 రోజుల క్రితం ఆధార్ కేంద్రాన్ని ప్రారంభించారు. సమీపంలోనున్న ఆలూరు మండలంలో కూడా ఆధార్ సెంటర్ లేకపోవడంతో ఇక్కడి కేంద్రానికి ప్రజలు తరలివస్తున్నారు. ఇక్కడి సిబ్బంది రోజుకు 30 - 40 మందికి మాత్రమే ఆధార్ అప్‌డేట్ చేస్తున్నారు. ఈ కేంద్రానికి రోజుకు కనీసం వంద మంది వస్తున్నారు. అపార్ ఐడీ కోసం ఆధార్‌లో సవరణలకు రోజూ తిరగాల్సి వస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. గూళ్యం, చింతకుంట గ్రామాల్లో కూడా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కంది పంట దగ్ధం

- మంటలను ఆర్పే క్రమంలో ప్రమాదానికి గురైన రైతు


గాయపడిన రైతు రంగన్న

కృష్ణగిరి: ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుని ఆరు ఎకరాల కంది పంట దగ్ధమైన సంఘటన మండలంలోని బోయబొంతిరాళ్ల గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన హరిజన గాడుదుల రంగన్న తనకున్న మూడు ఎకరాలకు తోడుగా మరో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకుని జీవనం సాగిస్తున్నాడు. కౌలుకు తీసుకున్న పొలంలో కంది పంట సాగు చేశాడు. పంట చేతికి రావడంతో వారం కిందట కూలీలతో కోయించాడు. శనివారం రోజు కందికట్టెను టార్పిళ్లపైకి చేర్చాడు. పంటను మిషన్‌తో నూర్పిడి చేసుకుని కౌలు చెల్లించుకోవాలనుకున్నాడు. ఇంతలో ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో కళ్లెదుటే పంట కాలిపోతుంటే కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రయత్నించాడు. సమాచారం అందుకున్న గ్రామస్తులు బిందెలతో నీటిని తెచ్చి ఆర్పేందుకు ప్రయత్నించినా గాలి ప్రభావం ఎక్కువగా ఉండటంతో కాలి బూడిదైంది. దీంతో రైతు కన్నీరుమున్నీరయ్యాడు. సుమారుగా పది ఎడ్ల బండ్ల కంది పంట కాలిబూడిదై రెండున్నర లక్షల వరకు నష్టపోయానని విలపించాడు. ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ రవిమోహన్, గ్రామస్తులు కోరారు.


బోయబొంతిరాళ్ల పొలాల్లో కాలిపోతున్న కంది పంటను రక్షించేందుకు ప్రయత్నిస్తున్న గ్రామస్తులు

మధ్యాహ్న భోజనం ప్రారంభం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తిలోని జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ నాగభూషణంరెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా కళాశాలలో ప్రారంభించామన్నారు. మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

దేవనకొండ: మండలంలో విద్యా రంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు మధు, భాస్కర్ కోరారు. ఈ మేరకు శనివారం దేవనకొండకు వచ్చిన ఎంపీ పంచలింగాల బస్తిపాటి నాగరాజును ఏఐఎస్‌ఎఫ్ మండల ప్రతినిధి బృందం కలిసి విద్యారంగ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ దేవనకొండలో హాస్టల్ వసతి లేక విద్యార్థులు సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సి వస్తోందన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో మోడల్ స్కూల్ ఉన్నప్పటికీ దేవనకొండలో ఏర్పాటు చేయలేదన్నారు. బీసీ బాలికల వసతిగృహాన్ని ఏర్పాటు చేసి బాలిక విద్యకు పెద్దపీట వేయాలన్నారు. సురేంద్ర, రవితేజ, రవీంద్ర, భరత్, తేజ, నాగరాజు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు వాల్వ్ ఏర్పాటు చేయాలి

తుగ్గలి : శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి పైప్‌లైన్‌కు వాల్వ్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములు కోరారు. ఈ మేరకు శనివారం జొన్నగిరి గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి నారాయణస్వామికి వినతి పత్రం అందజేశారు. ఏటా వేసవిలో తీవ్ర నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జొన్నగిరిలో పైప్‌లైన్‌కు వాల్వ్ ఏర్పాటు చేస్తే నీటి సమస్య ఉన్న సమయంలో దాహార్తి తీర్చుకునేందుకు ఉపయోగపడుతుందన్నారు. యడవలి నుంచి జొన్నగిరి మీదుగా జియో మైసూర్ గోల్డ్ మైనింగ్ కంపెనీకి ఏర్పాటు చేస్తున్న పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఆ పైప్‌లైన్‌కు వాల్వ్ ఏర్పాటు చేసేలా చూడాలని కోరారు. కొండారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించండి

మద్దికెర : గ్రామంలోని ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ బండారు సుహాసిని, ఈఓ శివకుమార్ కోరారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో చెత్త బుట్టల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.